పిజిఆర్ఎస్‌కు 382 అర్జీలు

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ వివేకానంద హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసరావు, జిజిహెచ్ ఎఒ ఎన్.శ్రీధర్, ఎస్ఎస్ఎ ఎపిఒ పి.వేణుగోపాల రావు, తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలను, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని డిఆర్ఒ వెంకటరావు అధికారులను ఆదేశించారు. మొత్తం 382 అర్జీలు అందాయి.

పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్

- యాజమాన్యాల ఒత్తిళ్లు
- అయోమయంలో విద్యార్థులు
- దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు
- విడుదలపై ప్రభుత్వం మీనమేషాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక్కో కాలేజీకి రూ.కోట్లల్లో బకాయిలు నిలిచిపోవడంతో ఆయా యజమాన్యాలు సైతం అయోమయానికి గురవుతున్నాయి. ప్రభుత్వం నుంచి విడుదల చెయ్యలేదు కాబట్టి మీరే చెల్లించాలంటూ పలుచోట్ల యాజమాన్యాల నుంచి విద్యార్థులకు ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరపైనే కావస్తున్నా రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్న మూలంగా తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదిగో ఇదిగో అంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,400 కోట్ల బకాయిలు విడుదలపై సర్కారు ప్రకటనలు ఇస్తోంది తప్ప వాటిని చెల్లించేందుకు ముందుకు కదలడం లేదు. జిల్లాలో ఉన్న కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు కళాశాలకు వేస్తాము. విద్యార్థులు ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా వాళ్ల పరీక్ష ఫీజులు, సర్టిఫికెట్లు ఆపకూడదని చెప్పినా ఇంజినీరింగ్ కాలేజీలు విద్యార్థులను ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయి.

కాకినాడ జెఎన్‌టియు పరిధిలో మొత్తం 28 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 10 కాలేజీలు కాకినాడ జిల్లాలో ఉన్నాయి. మిగిలిన 18 కాలేజీలు కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఉన్నాయి. మొత్తం 28 కాలేజీల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సుమారు 12 వేల మంది ఉన్నారు. కాకినాడ జిల్లాలో పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ కాలేజీలు మరో 150 వరకూ ఉండగా వీటిల్లో సుమారు 40 వేల మంది చదువుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసింది. దీనికి తోడు వసతి దీవెన కూడా అందించేది. కొద్దిరోజులు తేడా మినహా సమయానికి ఈ సొమ్ములు విద్యార్థులు ఖాతాల్లో జమ చేసేది. గతేడాది ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో చివరిలో రీయింబర్స్‌మెంట్‌కు నిబంధనలు అడ్డు వచ్చాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2023-24 విద్యా సంవత్సరంలో మూడు విడతలు, 2024-25లో రెండు విడతలు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి ఉండగా ఒక విడత మాత్రమే విడుదల చేసి కూటమి చేతులు దులుపుకుంది.

రూ.వెయ్యి కోట్లపైనే బకాయిలు

ఉమ్మడి జిల్లాలో ఒక్క ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించి రూ.వెయ్యి కోట్లుపైనే బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం వీటికి రూ.600 కోట్ల వరకూ బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వంలో రూ.540 కోట్ల బకాయి ఉంది. కాకినాడ జిల్లాలో పేరు గాంచిన ఒక ప్రముఖ కాలేజీకి రూ.90 కోట్లపైనే బకాయిలు ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఒక కాలేజీకి రూ.5 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇలా చిన్నా, పెద్ద కళాశాలకు ఒక్కో దానికి రూ.5 నుంచి రూ.15 కోట్లు రెండేళ్లకి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

చెల్లింపుల కోసం విద్యార్థులపై ఒత్తిళ్లు

రెండేళ్ల కాలంలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా పలు కళాశాలలు ఇబ్బంది పెడుతున్నాయని సమాచారం. ఫీజు చెల్లించే వరకూ వాటిని ఇవ్వబోమంటూ తేల్చి చెబుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో తమ సర్టిఫికెట్లను ఆయా కంపెనీలు, ఇతర విద్యాసంస్థలకు ఇవ్వకపోతే ఉపాధి అవకాశాలు పోతాయని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోవడంతో విద్యార్థులే చెల్లించాలని పలు కాలేజీలు తెగేసి చెబుతున్నాయి. మరికొన్ని కళాశాలల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో పలువురు లబోదిబోమంటున్నారు సర్టిఫికెట్లు అత్యవసరం అనుకుంటున్న పలువురు విద్యార్థులు అప్పులు చేసి కాలేజీలకు ఫీజులు కడుతున్న పరిస్థితి ఏర్పడింది. అనుకున్న సమయానికి ఆయా కంపెనీలకు సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఉద్యోగం పోతుందనే ఆందోళనతో తల్లిదండ్రులు పలుచోట్ల ఆస్తులను తాకట్టుపెట్టి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి. మరోవైపు యాజమాన్యాల వాదన మరోలా ఉంది. ప్రభుత్వం సకాలంలో రీయింబర్స్‌మెంట్ సొమ్ములు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అధ్యాపకులు, అధ్యాపకేత్ర సిబ్బంది వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు కోసం ప్రతినెలా అప్పులు చేయాల్సి వస్తోందంటూ చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రియంబర్స్మెంట్ సొమ్ములను విడుదల చేయాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

ఫీజు బకాయిల కోసం వర్షంలో కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన (ఫైల్)

అప్పులు చేసి ఫీజులు చెల్లించలేం

మొదటి సంవత్సరం అప్పులు చేసి ఫీజులు చెల్లించాము. రెండో సంవత్సరం ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదు. నాలుగేళ్లు ఇలా కొనసాగితే కాలేజ్, హాస్టల్ ఫీజు, రోజువారీ ఖర్చులను భరించడం చాలా కష్టం. ఇప్పటికే మా తల్లిదండ్రులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేయాలి.

- వివేక్, బిటెక్ రెండో సంవత్సరం, కాకినాడ.

ఆందోళన ఉధృతం చేస్తాం

ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములను తక్షణమే విడుదల చేయాలి. ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ఆందోళనలు చేసి వినతిపత్రాలు అందించాము. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే విద్యార్థులతో ఆందోళనలు మరింత ఉదతం చేస్తాం.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

మేము ఎలా చదవాలి

మొదటి సంవత్సరంలో నాలుగు విడతలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలైంది. రెండు, మూడేళ్లకు ఒక విడత మాత్రమే రాగా నాలుగో సంవత్సరంలో ఇప్పటివరకూ ఒక్క విడత కూడా విడుదల చెయ్యలేదు. మేమంతా ఎలా చదవాలి. ప్రభుత్వం స్పందించాలి.

- ఎం.చైతన్య, బిటెక్ ఆఖరి సంవత్సరం.

ఎస్ఇజెడ్ భూముల బదిలీ వేగవంతం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ఎస్ఇజెడ్ భూములు రైతుల పేరును బదిలీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బదిలీ ప్రక్రియపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమన్వయ ఆయన సమావేశం నిర్వహించారు. సెజ్ భూములు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఇజెడ్ లిమిటెడ్ ద్వారా 1,189 ఎకరాల భూమిని 1,545 మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మి, పాడా పీడీ చైత్ర వర్షిణి, ఎస్ఇజెడ్ ఎస్‌డిసి పి.వేణుగోపాలరావు, కాకినాడ సెజ్ జిఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ముంబై ఆందోళనలో పాల్గొన్న కాకినాడ జిల్లాకు చెందిన మెడికల్ రిప్స్

మెడికల్ రిప్స్ ఆందోళన విజయవంతం

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ముంబై ఆజాద్ మైదాన్‌లో సోమవారం నిర్వహించిన ఆందోళన విజయవంతమైనట్టు ఎపి ఎంఎస్ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు, కోశాధికారి దుంపల ప్రసాద్, కాకినాడ బ్రాంచ్ కార్యదర్శి ఎఆర్‌సి.వర్మ తెలిపారు. కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, మెడికల్ రిప్స్‌పై మందుల కంపెనీల వేధింపులు అరికట్టాలని, నిర్ధిష్టమైన పని పద్ధతులు అమలు చేయాలని, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధానాలు ఆపాలని ఈ ధర్నాలో వక్తలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, షంషుద్దీన్, వెంకటేష్, శేఖర్, శ్యామ్, దుర్గా ప్రసాద్, నరేష్, కిశోర్, కెటి.అప్పారావు, రామ్మోహన్, భాస్కర్, రామ్మూర్తి, ఇమ్మాన్యుయేల్, వాసుదేవ్, శ్రీధర్, కె.అప్పారావు, సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం

జెఎన్‌టియుకె హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జెఎన్‌టియుకెలో హాస్టల్ భవనాన్ని తక్షణమే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ బృందంతో కలిసి భవనాన్ని పరిశీలించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఉన్న జెఎన్‌టియుకెలో విద్యార్థుల హాస్టల్ కోసం నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఒకే గదిలో నలుగురు, ఐదుగురు విద్యార్థులు ఉండడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకే గదిలో ఉండడంతో సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉండడం లేదన్నారు. వెంటనే భవనాన్ని ప్రారంభించని పక్షంలో విద్యార్థులందరినీ హాస్టల్ భవనంలోకి పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.లోవరాజు, నగర కార్యదర్శి పగడాల సత్యంఉన్నారు.

కార్టూ'నిజం'



సాహిత్యంతో సామాజిక వికాసం

ప్రజాశక్తి-పెద్దాపురం

సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం సిద్ధిస్తుందని సాహితీ స్రవంతి అధ్యక్షుడు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కవి సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఎంతోమంది కవులు స్వాతంత్ర పోరాటం కోసం, సాంఘిక సంస్కరణల కోసం, సామాజిక మార్పు కోసం కలం పట్టుకుని తమ జీవితాలను అంకితం చేశారన్నారు. సామాజిక చైతన్యంలో సాహిత్యం ప్రముఖ పాత్ర వహించిందన్నారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, చర్ల రామారావు, తాటిగడప సుబ్బారావు, బళ్లమూడి సూర్యనారాయణ మూర్తి, బి.నాగమణి, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

మల్లేపల్లి సర్పంచ్ వరలక్ష్మి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మల్లేపల్లి సర్పంచ్ బల్‌రెడ్డి వరలక్ష్మి గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆమెకు ఉదయం గుండెపోటు రావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషయమించడంతో ఆమె మృతి చెందారు. వరలక్ష్మి భర్త గంగరాజు మల్లేపల్లి సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. ఆమె మృతికి పలువురు ప్రజాప్రతితులు, అధికారులు సంతాపం తెలిపారు. ఆమె సేవలను ప్రజలు గుర్తు చేసుకున్నారు.

సర్పంచ్ వరలక్ష్మి



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలానికి చెందిన 9 మందికి సుమారు రూ.4 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అందజేశారు. మురమళ్ల క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుబ్బరాజు మాట్లాడుతూ ఇప్పటివరకూ నియోజకవర్గంలో 47 మందికి రూ.36 లక్షల సియం రిలీఫ్ ఫండ్ సాయం అదజేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, వనమాడి నూకరాజు పాల్గొన్నారు.

సిపిఐ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శత వసంతాల సభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జామాయిల్ తోటలో జట్టు సంఘం అధ్యక్షులు వై.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఎఐటియుసి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎరువుల నిల్వలు సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

రానున్న రబీ సిజనుకు అవసరమైన ఎరువులను డీలర్లు సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక రైతు భవన్‌లో మూడు మండలాల డీలర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సామర్లకోట, పెదపూడి, కాకినాడ మండలాలకు చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా ఎరువుల నిల్వలు సిద్ధం చేసుకోవాలని డీలర్లకు సూచించారు. డీలర్లు తమ తరపున ఎఫ్ఒఎల్‌కి మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.దుర్గాలక్ష్మి, సత్యనారాయణ, సత్యప్రసాద్, మురళి,శాంతి, కమల, రూప, శంకర్, రామకృష్ణ, గౌడ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి కె.విజయ కుమార్

సిఆర్‌పిలు వారధులుగా పని చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట

సిఆర్‌పిలు రైతులు, ప్రభుత్వం మధ్య వారధిగా పని చేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సిఆర్‌పిల కోసం సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో మంచి పని తీరు, నాయకత్వ లక్షణాలు కలిగిన వారిని సిఆర్‌పిలుగా ఎంపిక చేశామని, రైతుల్లో మార్పు తీసుకురావడం, వారి ఉత్పత్తిదారుల సంఘాలతో సమన్వయం చేయడం మీ ప్రధాన బాధ్యత అన్నారు. ప్రిన్సిపల్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకట్రావు, వైస్ ప్రిన్సిపల్ జి.రమణ, డిడిఒలు డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్.శర్మ, డిపిఎం టి.బాబూరావు, ఎపిఎంలు జగదీశ్వరి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

పలుచోట్ల సోమవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఏలేశ్వరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 75 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్టు లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయుడు నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోట గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బందిల రత్నమణి పర్యవేక్షణలో నిర్వహిరంచిన ఈ పోటీల్లో ఆగ్నేయ, బాలమురళీ కృష్ణ పాల్గొన్నారు.

పెదపూడి శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి కృష్ణవర్ధన్ తెలిపారు. ఎంఇఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

కరప వేళంగి శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళనాలు నిర్వహించారు. కవులు జాతికి చేసిన సేవలపై వివరించినట్టు లైబ్రేరియన్ పివి.రంగయ్య తెలిపారు.

పిఠాపురం గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రముఖ చిత్రకారుడు బోండా శివరామకృష్ణ మాట్లాడారు. లైబ్రేరియన్ ఆర్.వెంకట రాము పాల్గొన్నారు.

సామర్లకోటలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నేడు జూడో జిల్లా జట్టు సెలెక్షన్స్

ప్రజాశక్తి - జగ్గంపేట

జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జూడో జట్టు సెలెక్షన్స్ మంగళవారం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టివివి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ డిఎస్‌సి గ్రౌండ్ వద్ద ఉదయం 8 గంటల నుంచి ఈ సెలక్షన్స్ ప్రారంభం అవుతాయని, జూడోలో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు నిర్ధిష్ట సమయానికి హాజరవ్వాలన్నారు. సెలక్షన్‌కు వచ్చే వారి వయస్సు 15 ఏళ్ల ఉండాలని, ఆధార్ కార్డు, 10వ తరగతి మార్క్‌లిస్ట్, జనన ధవపత్రం జెరాక్స్ కాపీలను తీసుకు రావాలని సూచించారు.

21న ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశం

ప్రజాశక్తి-పిఠాపురం

రబీ పంటకు నీరు అందించేందుకు సాగునీటి లభ్యత, నీటి విడుదల ప్రణాళికపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ నెల 21న కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తను కార్యాలయంలో అందుబాటులో ఉంటానని సలహాలు, సూచనల, చర్చించవలసిన అంశాలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో మంగళవారం ఆర్‌సిఎం చర్చి ప్రాంగణంలో సెయింట్ విన్సెంట్ డిఫాల్ సొసైటీ ఆధ్వర్యంలో పిఠాపురం క్రిస్టియన్ మెడికల్ సెంటర్ నిర్వహణతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చర్చ్ ఫాదర్ మరియదాసు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం ఉంటుందని, ఈ శిబిరంలో కళ్ళ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ మరియు ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు.

జార్జి పేటలో కోటి సంతకాల కార్యక్రమంలో వైసిపి నేతలు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి -తాళ్లరేవు

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి విజయానికి అందరూ సన్నద్ధం కావాలని ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్, సిఇసి సభ్యులు పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నీలపల్లిలో రెడ్డి సతీష్ ఆధ్వర్యంలో, జార్జిపేటలో రెడ్డి నాగు, పెట్ల సూర్యనారాయణ రాజు, పేర్ని ఆదినారాయణమూర్తి ఆధ్వర్యంలో రచ్చబండలో కోటి సంతకాలు కార్యక్రమం నిర్వహించారు. మల్లవరంలో సర్పంచ్ పంపన రామకృష్ణ, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పోలేకుర్రులో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఉంగరాల సంతోష్, చినబొడ్డులో కొపనాతి నాగరాజు, సంగాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, తాళ్ళరేవులో నంది కోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి, పిల్లి మణికంఠ ఆధ్వర్యంలో రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్, రేకాడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి నీరుకొండ రాజీనామా

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కాంగ్రెస్ పార్టీ ప్రతిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి నీరుకొండ సత్యనారాయణ సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామా పత్రాన్ని పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు పంపారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆయన సర్పంచ్, జెడ్‌పిటిసితో పాటు వివిధ పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఆదరించిన ప్రత్తిపాడు ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు కతజ్ఞతలు తెలిపారు. ఆయన సతీమణి రామకుమారి ప్రస్తుతం ఏలేశ్వరం జెడ్‌పిటిసిగా ఉన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో ఖండవల్లి, పెరవలి గ్రామాల్లో పేకాడుతున్న 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... తమకు అందిన సమాచారం మేరకు సోమవారం ఖండవల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.4,040 నగదును స్వాధీనం చేసుకున్నామనానరు. అలాగే పెరవలిలో నలుగురుని అదుపులో తీసుకుని వారి నుంచి రూ.3,050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కలవలపల్లి గ్రామానికి చెందిన ఇరగవరపు ఆంజనేయులు(22) శనివారం బైకుపై విజ్జేశ్వరంలో ఉన్న తన సోదరి ఇంటికి వెళ్లాడు. అనంతరం రాత్రి 7గంటల సమయంలో తిరుగుపయనమయ్యాడు. బ్రాహ్మణ గూడెం శివారుకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్ను సీతానగరం పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు సీతానగరం పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కేసు వివరాలను మైనింగ్ శాఖ అధికారులకు బదిలీ చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్‌కుమార్ హెచ్చరించారు.

ఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దుళ్లలో భారీ చోరీ

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో సోమవారం భారీ చోరీ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో చెరువు గట్టు రోడ్‌లోని ముసునూరి సూరిబాబు కుటుంబం నివాసం ఉంటుంది. ఆదివారం వారు ఇంటికి తాళం వేసి అమలాపురంలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. సోమవారం వారి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో స్థానికులు వారికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన వారు ఇంటికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో ఉన్న విలువైన వస్తువులు వెండి వస్తువులు, 20 గ్రాముల బంగారం, రూ.1.75 లక్షల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ మేరకు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ అల్లు వెంకటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించాయి. ఈ మేరకు కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు వంగలపూడి గొంతాలమ్మ వీధికి చెందిన యాళ్ల శైలు సోమవారం తెల్లవారుజాము నుంచి అదృశ్యమైందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. బాలిక ఆచూకీ తెలిస్తే కోరుకొండ సిఐ 9440904829, సీతానగరం ఎస్ఐ 9440904832 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

బాలికపై బాలుడు లైంగిక దాడి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల పరిధి నల్లూరు గ్రామంలో 11 సంవత్సరాల బాలుడు 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై సోమవారం అంగర పోలీసులకు బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ సోమవారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలోని బౌద్ధ ధమ్మ పీఠం ఆధ్వర్యంలో, మైత్రేయ బుద్ధ విహార్ ఆవరణలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 100 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించామని పీఠాధిపతి భంతే ఆనందా తెలిపారు. వేమగిరి, పరమానంద యోగానంద నేత్ర వైద్యాలయ సహకారంతో ప్రతి నెలా మాదిరే సోమవారం ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి, ఆసుపత్రికి తీసుకెళ్లి, ఆపరేషన్ అనంతరం వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు. 15 మందికి కళ్లజోళ్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం సిబ్బంది, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ వద్దు : జెవివి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వద్దని జెవివి నాయకులు డిమాండ్ చేశారు. జెవివి ప్రచురించిన 'పిపిపి పేరుతో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ వద్దు' బుక్ లెట్‌ను రాజమహేంద్రవరంలోని ప్రదీప్ హాస్పిటల్‌లో జెవివి నాయకులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు కె.భీమయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజానీకానికి వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేసే ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. ప్రజారోగ్య వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రజారోగ్య వ్యవస్థకు జిడిపిలో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు భీమయ్య మాట్లాడుతూ సంక్షేమ రంగాల బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. పేదలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేసే విధానాను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.ప్రదీప్, జి.తాతారావు, బిఎస్‌వివి.ప్రసాదరావు, జెవివి.సత్యనారాయణ, సిహెచ్.నిశ్చల్, బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

19న పాలంగిలో మెగా వైద్య శిబిరం

ఉండ్రాజవరం : అఖిల భారత సహకార సంఘాల 72వ వారోత్సవాలను పురస్కరించుకుని, పాలంగి పిఎసిఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కాకర్ల నాని సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు సోడిశెట్టి తేజశివకుమార్, రత్నకమల్‌నాయుడు పుప్పాల, కడలి అయ్యప్ప వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరాన్ని పాలంగి, కె.సావరం గ్రామ రైతులు, సొసైటీ సభ్యులు, గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే

పెరవలి : ఎల్‌సిడిసి కేసుల కోసం గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. పెరవలి పిహెచ్‌సి పరిధిలో అన్ని గ్రామాల్లో ఎఎన్ఎం, ఆశ వర్కర్లు వాలంటీర్లు సర్వే చేస్తున్నారు. చర్మ వ్యాధులు, దీర్ఘకాలిక మచ్చలు ఉన్నవారిని గుర్తించి వారికి వైద్యం అందిస్తామని వైద్యాధికారి రాజనాల ప్రసాద్ తెలిపారు.

వాటర్ బాటిళ్ల బహూకరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని మోర్త నెం-2 పాఠశాల విద్యార్థులకు పూర్వ ఉపాధ్యాయురాలు కె.బేబిలక్ష్మి స్టీల్ వాటర్ బాటిల్స్ అందించారని ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎస్ఎల్‌వి.ప్రసాదరావు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ఎస్‌జిటిగా విధులు నిర్వహించిన బేబీ క్ష్మి ప్రస్తుతం బదిలీపై ఉండ్రాజవరం-2 పాఠశాలకు వెళ్లారన్నారు. 40వ శుభదిన్‌ను పురస్కరించుకుని, ఆమె కుమార్తె రేష్మ ప్రణీత విద్యార్థులకు వాటర్ బాటిళ్ల అందించారన్నారు. అలాగే మిడ్డేమీల్స్‌లో కేసరి, గారెలు అందించారన్నారు.

యుడిజిఎఎం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో ఎన్నో ఏళ్లుగా వినియోగం లేకుండా పేరుకుపోయిన డిపాజిట్లను తిరిగి లబ్ధిదారులకు చేర్చేందుకు ఆర్‌బిఐ చేపట్టిన యుడిజిఎఎం పోర్టల్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లను కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం ఆవిష్కరించారు. పదేళ్లుగా లావాదేవీలు జరగని ఖాతాల వివరాలు ప్రజలకు, సంస్థలకి చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కీర్తి చేకూరి తెలిపారు. దేశవ్యాప్తంగా పబ్లిక్ బ్యాంకుల్లో రూ.58,400 కోట్లు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.8,600 కోట్లు అన్ క్లెయిమ్డ్ రూపంలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలోనే సుమారు రూ.97 కోట్లు ఉన్నాయన్నారు. ఇందులో సుమారు 5.10 లక్షల వ్యక్తిగత ఖాతాలకు చెందిన రూ.75 కోట్లు, 20వేల పరిశ్రమల ఖాతాలకు చెందిన రూ.18 కోట్లు, 5వేలు ప్రభుత్వ ఖాతాలకు సంబంధించి రూ.4 కోట్లు ఉన్నాయన్నారు. ఈ వివరాలను www.unclaimed.orgలో ఈ వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఖాతాదారులు, నామినీలు, కుటుంబ సభ్యులు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే బ్యాంకులు ఈ మొత్తాన్ని తిరిగి అందిస్తాయనిలీడ్ బ్యాంక్ మేనేజర్ డి.వి.ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంఓ జెసి వై.మేఘాస్వరూప్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, సిపిఒ ఎల్.అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఆర్ఆర్.ప్రేమ్‌కుమార్, భాగ్యలక్ష్మి, డిఎస్‌పి భవ్య కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ, సంరక్షణ యాక్ట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ యాక్ట్‌పై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించామని పారా లీగల్ వాలంటీర్ కాకర్ల నరసన్ననాని తెలిపారు. సోమవారం జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా అడిషనల్ జడ్జి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉండ్రాజవరం బేతిన సుబ్బాయమ్మ నందిగం అప్పారావు వృద్ధ జనా సేవాశ్రమంలోని వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకొన్నారు. వారికి మనోధైర్యాన్ని కల్పించారు. న్యాయపరమైన సమస్యలపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

20న భవన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షుడు పాసిల రమణ పిలుపునిచ్చారు. సోమవారం యూనియన్ నాయకులు ఆరిరెడ్డి వెంకటలక్ష్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డును గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే దీనిని పునరుద్ధరిస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఎన్నికల హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ఆదిరెడ్డి శ్రీను, రాజమండ్రప్ప రామారావు, గొల్ల బాబు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంపై దాడికి నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

హిందూపురంలోని వైసిపి కార్యాలయంపై దాడిని ఖండిస్తూ సోమవారం పార్టీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. బాలాజీ చెరువు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద చేపట్టిన ఈ నిరసనలో వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ హిందూపురంలో పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించారు. ఇలాంటి దాడుల సంస్కృతి రాష్ట్రంలో మంచిది కాదని, ప్రభుత్వం వెంటనే దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎంపీలు వంగా గీత, తోట నరసింహం, ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి ముద్రగడ గిరి, పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ జమ్మలమడక నాగమణి, పి.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ ఆదేశించారు. ప్రతి సోమవారం శారదమ్మ గుడి సమీపంలోని కార్పొరేషన్ కార్యాలయ సమావేశ హాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం యథావిధిగా కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ స్వయంగా అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ వంటి విభాగాలకు సంబంధించిన సమస్యలపై 11 మంది అర్జీలను కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.టి.శ్రీనివాస్, ఎస్ఇ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డిసిపి కృష్ణారావు, మేనేజర్ సీతారామ్ పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై ఐఎఫ్‌టియు ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 23ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్‌లో ఉన్న కార్మికులు, ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్ వంటి స్కీమ్ రంగాల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ ధర్నాలో గుబ్బల ఆదినారాయణమూర్తి, రాగుల రాఘవులు, రాఘవ, ఎల్లారావు, నాగేశ్వరరావు, రాంబాబు, రాజు, శ్రీను, రాము, చిన్ని, శ్రీకాంత్, మహేష్, వెంకన్న శ్రీను, శివ, పేతురు, రాము, లోవరాజు, యశోద, మంగ పాల్గొన్నారు.

ఎస్‌సిడిలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మూడో కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన డిగ్రీ కోర్సుల సీట్లను స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ఈ నెల 17 నుండి 20వ తేదీ వరకు భర్తీ చేస్తామని, విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

పెద్దాపురంలో అన్నదానాలు

ప్రజాశక్తి-పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయం వద్ద కార్తీక సోమవారం సందర్భంగా మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపయ వద్ది శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ మొయ్యి సంధ్య, సర్పంచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కాండ్రకోటలో నూకాలమ్మ ఆలయం వద్ద పట్నాల రామస్వామి ఆలయంలో మహా అన్నదానం నిర్వహించారు.

మడ అడవులలను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-కాకినాడ

పర్యావరణ పరిరక్షణ కోసం మడ అడవులలను కాపాడాలని సిపిఎం ప్రతినిధి బృందం సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి వినతిపత్రం సమర్పించారు. కాకినాడ రూరల్ అధ్యక్షుడు తిరుమల శెట్టి నాగేశ్వరరావు, చింతపల్లి అజయ్ కుమార్, తొట్టిపూడి రాజా తదితరులు మాట్లాడుతూ ప్రకృతి విలయాల నుంచి కాకినాడకు రక్షణ కవచంగా ఉన్న హోప్ ఐలాండ్, మడ అడవులు, చిత్తడి నేలలు ప్రజల ప్రాణాలు కాపాడుతున్నాయన్నారు. దుమ్ములపేట నుంచి తాళ్లరేవు వరకూ ఉన్న సముద్ర తీరప్రాంత పర్యావరణాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణల నుంచి ఈ భూములను కాపాడాలన్నారు.

పాడా పిజిఆర్‌ఎస్‌కు 31 అర్జీలు

ప్రజాశక్తి-పిఠాపురం

పట్నంలోని స్థానిక పాడా కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి ప్రజల నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌లో 31 అర్జీలు అందాయని వాటిలో రెవెన్యూ 15, మున్సిపాలిటీ 6, ఇతరాలు 6, ఆన్‌లైన్ అప్లికేషన్స్ 4 వచ్చాయన్నారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

వ్యాధిగ్రస్తునికి మణికర్ణిక సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటకు చెందిన దుర్గారావుకు మణికర్ణిక యువజన సంఘం సోమవారం సాయం అందించింది. దుర్గారావు దీర్ఘకాలికంగా శ్వాస కోస వ్యాధితో బాధ పడుతున్నారు. యువజన సంఘం అధ్యక్షులు గున్నాబత్తుల పూజా అనుష, సభ్యులు మణికంఠ, వీరబాబు, ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

పాదగయకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-పిఠాపురం

కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో దక్షిణ కాశీ పాదగయ క్షేత్రానికి యాత్రికులు పోటెత్తారు. వేకువ జామునే క్షేత్రానికి చేరుకొని పుష్కరిణిలో స్నానాలు చేసిన దీపాలు వెలిగించి అనంతరం స్వామి అమ్మవారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు.

ఎంఎల్ఎ గొల్లపల్లిని కలిసిన అధికారులు

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖలో నూతన ఇఇగా బాధ్యతలు చేపట్టిన సుధారాణి సోమవారం స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణం ప్రారంభించాలని ఇఇకి ఎంఎల్ఎ సూచించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రాజు, బొడ్డు ప్రసాద్ పాల్గొన్నారు.

యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సూపరిడెంటెంట్‌గా విధులు నిర్వహిస్తూ నూతన మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన అద్దంకి మల్లికార్జునరావు సోమవారం స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ వెంట ఆసుపత్రి డిడి టి రవిశంకర్ ఉన్నారు.

స్టీల్ ప్లాంట్‌పై కూటమి కుతంత్రం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రేవు దాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా చంద్రబాబు వ్యవహారం ఉందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయబోమని కల్లబొల్లి మాటలు చెప్పారని గుర్తు చేశారు.. తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులపై నోరు పారేసుకోవడం తగదన్నారు. పని చేయని వారికి జీతాలు ఇవ్వడం ఎందుకు దండగా అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను నాగమణి తప్పు పట్టారు.. ఆంధ్రుల హక్కుగా ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారంపై తెల్లఏనుగు అంటూ చంద్రబాబు వ్యాఖ్యలు ఆ ఉద్యమాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు.

గొల్లప్రోలు కమిషనర్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్‌గా పి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన నరసరావుపేట పురపాలక సంఘంలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. పదోన్నతిపై గొల్లప్రోలు నగర పంచాయితీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి -కరప

కరప గ్రామంలోని పల్లపు వీధి శివారు నుంచి భీమకర్ర కాలువ వరకూ రూ.5.5 లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయినట్టు జనసేన నాయకుడు యాళ్ల సత్యనారాయణ తెలిపారు. రైతుల రాకపోకలకు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడేవారని, ఎన్నికల ప్రచారంలో పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లగా అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మించారని తెలిపారు.

ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

ప్రజాశక్తి-పెదపూడి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,045 ఎత్తిపోతల పథకాల సమగ్ర అభివృద్ధికి నీటిపారుదల అభివద్ధి సంస్థ రూ.750 కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందించినట్టు ఆ సంస్థ ఉభయ గోదావరి జిల్లాల ఇఇ పి.దుర్గా గురవయ్య తెలిపారు. సోమవారం జి.మామిడాడ ఎత్తిపోతల పథకం వద్ద నిర్వహించిన రైతుల వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ సంస్థ కోరిన నిధులు విడుదలైతే ఎత్తిపోతల పథకాల స్వరూప స్వభావాలు మారిపోతాయని, రైతులు లాభపడతారని తెలిపారు. నిధుల విడుదల కోసం రాష్ట్ర ఎత్తిపోతల పథకాల చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ గట్టి కృషి చేస్తున్నారని తెలిపారు. పుట్టా సోమన్న చౌదరి, మేడపాటి వీర్రెడ్డి, ఎఇ సుధీర్ పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

ప్రజాశక్తి-పెద్దాపురం

ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో శ్రీరమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఎఎంసి డైరెక్టర్ వీరబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి -తాళ్లరేవు

సాగు చేసిన ప్రతి గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. జార్జి పేట, నీలపల్లి, పత్తిగొంది, పి.మల్లవరంలో సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు సోమవారం ధాన్యం తూకాలను పరిశీలించారు. 75 కేజీలకు రూ.1,777 రావాల్సి ఉండగా ధాన్యం మాసులు ప్రారంభ దశలోనే రైతులు దగ్గర మిల్లర్లు మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరకు రూ.1550కు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో మద్దతు ధరకు మాత్రమే విక్రయించాలని ఆయన కోరారు.

సిరిపురంలో గ్రామసభ

ప్రజాశక్తి -కరప

సిరిపురంలో సర్పంచ్ నున్న సుజాత సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఎంపిడిఒ జె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపిడిఒ సలాది శ్రీనివాసరావు పాల్గొని స్వమిత్వపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో హౌస్ టాక్స్ సకాలంలో చెల్లించి, గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. తడి పొడి చెత్తను క్లాప్ మిత్రలకు వేర్వేరుగా అందించాలని కోరారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సమ్మెట సత్యనారాయణ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మంచికంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ రద్దు చేయాలని కోరుతూ వైసిపి నాయకులు సోమవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. సోమవారం ఒకటి రెండు వార్డుల్లో వైసిపి పట్టణ అధ్యక్షుడు మైనం రాజా ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, గంధం నాగేశ్వరరావు, ఇరుగుల్లా రమేష్, అంజూరి రాంబాబు, బెందుకుర్తి సత్తిబాబు, గంటా అప్పలస్వామి, మొగిలి దొరబాబు, దాసం పూసలు, దివానం పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధనలు

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం శ్రీకష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు పాల్గొన్నారు. వీరబాబు, నూనె రామారావు, ముప్పన వీర్రాజు, గణేష్ పాల్గొన్నారు.

సంతృప్తికరంగా అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అర్జీదారుల సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి 16 అర్జీలు నమోదయ్యాయి. వీటిలో ఇంజినీరింగ్‌కి సంబంధించి 3, రెవెన్యూకి సంబంధించి 2, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి 7, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి ఒకటి, వార్డు సచివాలయాలకు సంబంధించి మూడు అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లీ, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, ఎంహెచ్ఒ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్‌మాలిక్, రెవెన్యూ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

21న క్లాప్, షెడ్ మిత్రలకు శిక్షణ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో పనిచేస్తున్న క్లాప్, షెడ్ మిత్రలకు ఈ నెల 21న శిక్షణ ఉంటుందని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శులో సోమవారం డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రవణ్‌కుమార్‌తో కలిసి ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్, షెడ్ మిత్రలకు 21వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తడి, పొడి చెత్త, ఇంటింటా చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఉంటుందన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

ప్రజారోగ్యాన్ని సంరక్షించడంలో పరిసరాల పరిశుభ్రతే ప్రధాన భూమిక పోషిస్తుందని సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రాజెక్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ గుర్రాల ప్రసంగిరాజు అన్నారు. సోమవారం ఉనకరమిల్లి, కాటకోటేశ్వరం, తిమ్మరాజుపాలెం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం తగదన్నారు. నీటి కాలుష్యం వలన వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాపరెడ్డి , పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE, KAKINADA(MACT)
M.V.O.P.No. 74/2022

Between:-
Jeeri Pentayya ...**Petitioner**
And
Sangadi Adivishnu & Others ...**Respondents**

To.
R2. Bondala Udaya Krishna, S/o. Surya Babu.R/o.D.No.62-1-48, Market Veedhi, Jagannadhapuram , Kakinada.
(Owner of Lorry Bearing No. AP07 TD 4268)

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది.28-11-2025** సం॥రం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పైకోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం)
దూడల లక్ష్మణరావు (అడ్వకేట్)
డోర్‌నెం.11-15-9, రామారావుపేట
కాకినాడ. సెల్. 8822112345

In the Court of the III addl District Judge Kakinada
M.V.O.P.No. 103/2024

Between:-
Dadala Anu Radha & another ...**Petitioners**
And
Dadala Eswara Rao and another ...**Respondents**

To.
R1. Dadala Eswara Rao,S/o. Subba Rao, Hindu, Aged 55Years, Sunkata Revu(Village), Tallarevu Mandal.
(Rider cum, owner of Honda Activa Bearing of No. AP 05 E.P.4845) ...**1st Respondent**

In the above matter the above 1st Respondent is avaiding to take court summons Intentionally so you are here by attend before the Hon'ble court on **28-11-2025** at above **10.30 A.M.** either is Person or by Advocate cousel Otherwiese in your absence Other Procee dings follows

(by court order)
S.NOOKARAJU
Advocate ,
Ramaraopet,Kakinada
Cell.9848524409

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు : కాకినాడ
I.A.No.514/2025; O.S.No.72/2025

Between:
అయ్యల లక్ష్మణరావు ...పిటీషనర్ / ప్లెయింటిఫ్
మరియు
బండారు పండు, వగైరా
...రెస్పాండెంట్లు / డిఫెన్‌డెంట్లు

R_1/D_1 : బండారు పండు,
S/o. లేటు వీరబద్రరావు, డోర్.నెం.29-9-22, మంధపాటి వారి వీధి, సంతచెరువు దగ్గర, కాకినాడ.
R_2 : బండారు శ్రీధర్,
S/o. లేటు వీరబద్రరావు, డోర్.నెం.29-9-22, మంధపాటి వారి వీధి, సంతచెరువు దగ్గర, కాకినాడ.

పైన తెలిపిన I.A.No.514/2025 లో టెంపరరీ ఇంజంక్షన్ పిటీషన్‌లో మీరు రెస్పాంట్లు నెం.1,2 అయ్యివున్నారు. మరియు పై దావాలో మీరు డిఫెన్‌డెంట్ నెం.1 అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు, సమను పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన పిటీషన్ మరియు దావా **ది. 04-12-2025 సం॥** తేదీన వాయిదా అయ్యివున్నది. కావున పై తేదీన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం.10.30 ని॥లకు** హాజరై మీ అక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పైన తెలిపిన పిటీషన్ మరియు దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||
TANALA VEERA PRABHAKAR,
Advocate, #45-5-9, Opp to Venkateswara Swamy Temple, Jaganadhapuram
Kakinada, Cell: 9885244477

వేలం ప్రకటన

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, MUMMIDIVARAM
E.P. No.8/2022 in AACF.No.181/2020

Between:
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd., Rep. by its Manager, Kakinada ...DHr
and
Ch. Dhana Lakshmi and others ...JDrs

2nd JDr: చింతలపూడి నాగ ప్రసాద్, S/o. చింతలపూడి కొండలరావు, కొబ్బరి వ్యాపారం, డో.నెం.9-134, బూరుగులంక, తానెలంక (PO), ముమ్మిడివరం (మం), డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబరు అమలు గ్రంథములో ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టువారి ఎదుటి ది.**26-11-2025** తేదీన ఉదయం గం॥ **10.30** ని॥ల వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు వచ్చి పాడుకొనగలరు. వివరములు కొరకు పై శ్రీ కోర్టువారి నజారత్ ఆఫీసు నందు గాని, డిక్రీ హోల్డర్ గారి అడ్వకేట్ గారి ఆఫీసులో గాని తెలియజేయబడును.

SCHEDULE OF PROPERTY BELONGING TO 2nd JDr:

All that the pieces and parcel of that building property situated at East Godavari Dist., Mummidivaram SRO, Mummidivaram Mandal, Tanelanka Panchayati/Village having R.S.No.391/3, bearing D.No.6-172, covered by an extent of 314.6sq.yds of site, thereon RCC building is bounded by:

East: C share land of Chintalapudi Veera Swamy, **West:** Road, **South:** Joint Way, **North:** House and site of Chintalapudi Venkata Rao family.

Within the above said boundaries covered by an extent of 314.6 sq.yds. of site and thereon RCC building with all fixtures and common ways and easement rights.

DHr Value: Rs.10,00,000/-
Amin Value: Rs.25,00,000/-, JDr Value: Not given

REDDY SATYANARAYANA MURTHY
Advocate, Mummidivaram
Cell: 8008442888, 7013468113